

## రజితకు నివాళులర్పించిన రేణుకుంట్ల సదయ్య

**వేద న్యూస్ శాయంపేట:**

శాయంపేట మండలం తహరాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బదుగు రవీందర్,అశోక్ సోదరి బదుగు రజిత ఇటీవల పరమపదించినారు. శుక్రవారం ఆమె దశదినకర్మ కార్యక్రమానికి పరకాల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రేణుకుంట్ల సదయ్య హాజరై మృతురాలి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. తహరాపూర్ గ్రామ మాజీ ఉప సర్పంచ్ కుక్కల బిక్షపతి, సంతోష్, కుమారస్వామి, చంద్రప్రకాష్, దిలీప్ పాల్గొన్నారు.



## అక్రమ ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్లు సీజ్

**వేద న్యూస్, కమలాపూర్ :**

ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే ఉపేక్షించవద్దని అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని వరంగల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల మేరకు మానేరు వాగు, పోతిరెడ్డిపల్లి, విలాసాగర్ గ్రామాల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను కమలాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సీజ్ చేశారు. ముగ్గురు ట్రాక్టర్ డ్రైవర్లు అయినటువంటి వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రామంచ పరశురాం, జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన ఆకు అశోక్, జమ్మికుంట మండలం విలాసాగర్‌కి చెందిన రామంచ నాగరాజులపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.



## యాదాద్రి థర్మల్ ప్లాంట్‌లో ప్రమాదం

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

మిర్యాలగూడ నియోజకవర్గం లోని దామరచర్ల మండలం వీర్లపాలెం లోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లో శుక్రవారం ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో వేడి బూడిద పడి సుమారు ఆరుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన కార్మికులను మిర్యాలగూడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు.



## జయశంకర్ జిల్లా టీఎస్‌జేయూ నూతన కమిటీ ఎన్నిక

**వేద న్యూస్, భూపాలపల్లి :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో శుక్రవారం తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్(ఎన్.యూ.జే.ఐ) నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పావుశెట్టి శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా ఎడ్ల సంతోష్,జిల్లా ప్రధాన కార్యదర్శిగా దొమ్మటి రవీందర్,జిల్లా ఉపాధ్యక్షులుగా బండారి రాజు,గట్టు రవీందర్,అరిగేలా జనార్ధన్,సంయుక్త కార్యదర్శులు పల్నాటి రాజు, కడపాక రవి,బొచ్చు భూపాల్,ఆర్గనైజింగ్ సెక్రటరీ సల్పాలా తిరుపతి, కోశాధికారిగా సంగెమ్ శేఖర్,మీడియా ఇంచార్జిగా కార్యూరి సతీష్,ఈసి సభ్యులుగా వ్యాంసాని రాజు,కె.దేవేందర్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఎడ్ల సంతోష్,ప్రధాన కార్యదర్శి దొమ్మటి రవీందర్‌లు మాట్లాడుతూ తమకు అవకాశం కల్పించిన రాష్ట్ర అధ్యక్షులు నారగాని పురుషోత్తం,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల అనిల్ కుమార్,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పావుశెట్టి శ్రీనివాస్ లకు,తమ ఎన్నికకు సహకరించిన జిల్లాలోని జర్నలిస్ట్ లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఎమ్మెల్యే నాగరాజును కలిసిన మహేష్

**వేద న్యూస్, హన్మకొండ :**



గ్రేటర్ వరంగల్ నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ సోషల్ మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ అడుప మహేష్ జన్మదిన సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శాలువతో మహేష్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు పస్తం శంకర్, ఎస్సార్ నగర్ గ్రామ అధ్యక్షుడు మచ్చర్ల స్టాలిన్,ఎన్టీఆర్ నగర్ గ్రామ అధ్యక్షుడు ఈర్ల రాజేందర్, ఏకామ్రాచారి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.





**బహుముఖ రంగాల్లో రాణిస్తున్న యువతి**

# అటు విద్యారంగంలోనూ..
# ఇటు కళారంగంలోనూ..

**వేద న్యూస్ డెస్క్**

**ఆమె ఓ యాంకర్..తన అద్భుతమైన వ్యాఖ్యానంతో కార్యక్రమాలను అనుసంధానిస్తుంది. ఆమె రీసెర్చ్ స్కాలర్. తెలంగాణ కథా రచయిత్రుల సాహిత్యాన్ని లోతుగా పరిశోధిస్తోంది. ఆమె డబ్బింగ్ ఆర్టిస్ట్. భిన్నమైన పాత్రలకు, ప్రకటనలకు సముచితమైన రీతిలో తన మాటల్ని అద్ది మెప్పిస్తోంది. ఆమె ఓ యాక్టర్. స్టేజ్ పై తన నటనతో అందరినీ అలరిస్తోంది. ఆమె రచయిత్రి. కథారచన చేస్తోంది. ఇలా బహుముఖీనమైన ప్రతిభతో అటు విద్యారంగంలోనూ..ఇటు కళారంగంలోనూ రాణిస్తూ, చదువును, కళను తన రెండు కళ్ళుగా చేసుకుని సాగుతోంది. ఆమెనే ' పెద్దపల్లి తేజస్వి'.**

యాంకర్‌గా, యాక్టర్‌గా, రీసెర్చ్ స్కాలర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా తన బహుముఖ ప్రతిభను చాటుతున్న పెద్దపల్లి తేజస్వి స్వస్థలం ఖమ్మం. తల్లిదండ్రులు పెద్దపల్లి యాకయ్య, సావిత్రి. చిన్నప్పటి నుంచే సాంస్కృతిక కార్యక్రమాలంటే ఇష్టమున్న తేజస్వి ప్రతీ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనేది. పాఠశాలలో, కళాశాలలో చదివే రోజుల్లోనే ఆమె తనలోని సృజనాత్మకతాశక్తికి పదును పెట్టింది. దేశభక్తి, జానపద పాటలు పాడి అందరినీ అలరించేది. వాటికి ఎన్నో బహుమతులను కూడా అందుకుంది. స్కూల్ లో చదువుతున్న రోజుల్లోనే మిమిక్రీ చేసి గురువులతో శభాష్ అనిపించుకుంది. అప్పటి నుంచి ఆమెకు కళ పట్ల మరింత ఆసక్తి ఏర్పడింది. తన ప్రతిభకు పదును పెట్టి మరింతగా సాధన చేసింది. చదువుతో పాటు కళారంగంలో కూడా తన ప్రత్యేకతను కనబరిచింది.

ఖమ్మంలోని గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకుంది. ఉమెన్స్ కాలేజీలో ఇంటర్మీడియట్, బి.జి.ఎన్.ఆర్ కళాశాలలో డిగ్రీ, ఎం.ఏ తెలుగు సాహిత్యం పూర్తి చేసింది. తన గురువు డా.జరుపుల రమేశ్ గారి ప్రోత్సాహంతో తెలుగు సాహిత్యం వైపు ఆసక్తి కలిగిందని, యు.జి.సి నెట్ అర్హత పొంది, పిహెచ్.డి చేయగలిగానని చెబుతోంది తేజస్వి. ఏకపాత్రాభినయం వైపు, సాంస్కృతిక కార్యక్రమాల వైపు తేజస్వికి ఆసక్తి కలగడానికి కళాశాల గురువు డా.బి.మాధురి గారే కారణమని చెబుతోంది. అమ్మ ,నాన్నల ప్రోత్సాహం, సలహాలు, సూచనలు కూడా తాను కళారంగంలో ఎదగడానికి ముఖ్య కారణమని అంటోంది తేజస్వి. తెలుగు సాహిత్యం వైపు అడుగులు వేసేందుకు నౌరిన్ మేడమ్ కూడా వెన్నంటి ఉండి ప్రోత్సహించారని చెబుతోంది.




ట్రినిటి కళాశాలలో బి.ఇడి పూర్తి చేసింది. కళాశాలలో చదువుతున్న రోజుల్లోనే కుటుంబ పెద్ద మద్యానికి బానిస అయితే స్త్రీ పడే ఆవేదన ఎలా ఉంటుందో తెలియజేస్తూ 2012లో 'యువతరంగం'లో ఏకపాత్రాభినయం చేసి పలువురి చేత ప్రశంసలందుకుంది. ఆ ఏకపాత్రాభినయానికి రాష్ట్రస్థాయిలో బహుమతినందుకుంది.

ఎం.ఏ పూర్తి చేసిన తరువాత 2018లో ఉస్మానియా యూనివర్సిటిలో పిహెచ్.డి సీటు సాధించింది తేజస్వి. 'తెలంగాణ కథా రచయిత్రులు - స్త్రీ జీవన చిత్రణ' అనే అంశంపై డా.నాళేశ్వరం శంకరం పర్యవేక్షణలో పిహెచ్.డి చేస్తోంది. 1991 నుంచి 2015 వరకు వచ్చిన తెలంగాణ రచయిత్రుల కథల్లో స్త్రీ జీవితం, పాత్ర చిత్రణ ఎలా ఉందో వివరిస్తూ పరిశోధన చేస్తోంది తేజస్వి.

చదువుతూనే తన అభిరుచులను కొనసాగిస్తూ ముందుకెళ్తోంది తేజస్వి. డిగ్రీ చదువుతున్నప్పటి నుంచే ఖమ్మం లోకల్ ఛానల్స్ లో న్యూస్ రీడర్ గా ఉంటూ 'గుడ్ మార్నింగ్ ఖమ్మం', 'లక్కీ లేడీ', 'లవ్ లీ సారీ', 'హౌసే గేమ్ షో', 'కాఫీ టైమ్' వంటి కార్యక్రమాలకు యాంకర్ గా చేసింది. ఇప్పటికీ ఎన్నో వందల కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరించింది. లబ్ధ ప్రతిష్ఠులైన కవులు, రచయితలున్న సభలో కూడా అనర్గళంగా మాట్లాడి తన ప్రతిభను చాటింది. ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి , పలువురు మంత్రులు, అధికారులు హాజరైన సభలకు కూడా వ్యాఖ్యాతగా వ్యవహరించింది. ఏ కార్యక్రమానికి హాజరైన వాక్చాతుర్యంతో, సమయస్ఫూర్తితో మెప్పించడం, కార్యక్రమాన్ని విజయవంతం చేయడం ఆమె ప్రత్యేకత.

జానపద పాటల్లో పల్లెపడుచుగా నటించడానికి అవకాశం రావడంతో 'ఎక్కడ ఉన్నాడో బిడ్డా', 'అరె..అరె..ఎంకటి' పాటలకు పాత్రాభినయం చేసింది. 'పార్వతి', 'చుక్కలు రాని ఆకాశం' వంటి లఘుచిత్రాల్లో, 'అసమర్థుడు', 'రాణి సోందేవి' మొ. నాటకాల్లో నటించి మెప్పించింది. థియేటర్ ఆర్టిస్ట్ గా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చుకుంది. సుమ యాంకర్ గా వ్యవహరిస్తున్న ఈటివి స్టార్ మహిళ ప్రోగ్రామ్ లో కూడా పాల్గొంది తేజస్వి.



నిరంతర సాహిత్యాధ్యయనం చేస్తూనే సాహిత్య సృజన చేస్తోంది. సామాజిక జీవన చిత్రణ గురించి, స్త్రీల సమస్యల గురించి తేజస్వి రాసిన వ్యాసాలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. ప్రముఖ రచయిత్రి దెంచనాల జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన 'అవలోకనం', 'గల్పిక తరువు', 'మల్లెసాల' పుస్తకాల్లో ఆమె రాసిన కథలు ప్రచురితమయ్యాయి. 2019లో తెలంగాణ సాహితి వారు సుందరయ్య విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన 'తెలుగెత్తి జైకొట్టు శతాధిక తెలుగు సాహితీవేత్తల జీవితం-సాహిత్యం' అనే అంతర్జాతీయ సదస్సులో 'అబ్బూరి ఛాయాదేవి కథల'పై పత్ర సమర్పణ చేసింది. మద్రాసు క్రైస్తవ కళాశాల నిర్వహించిన జాతీయ సదస్సులో సమ్మెట ఉమాదేవి 'రేలపూలు' కథాసంపుటిపై, 2022లో 'పాటకు జేజేలు' అంతర్జాతీయ సదస్సులో 'ప్రజాకవి గద్దర్ సినిమాపాటలు-విశిష్టత' పై ప్రసంగించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ శతాబ్ది సంబరాల సందర్భంగా నిర్వహించిన జాతీయ సదస్సులో డా. ఏ. సురేంద్ర కుమార్ పై, అంతర్జాతీయ సదస్సులో ఐతా చంద్రయ్య రాసిన కలికి గాంధారి కథ గురించి పత్రసమర్పణ చేసింది.

ఇటీవల తెలంగాణ సాహితి యూత్ లిటరరీ ఫెస్ట్ - 2024లో పాల్గొని కథారచయిత్రిగా తన అనుభవాలను గురించి, తన కథల్లోని వస్తువైవిధ్యాన్ని, పాత్రచిత్రణను గురించి వివరించింది. ఆమె రాసిన 'స్వభావం', 'మారిన మనిషి', 'లిపిస్టిక్', 'పెళ్ళి లొల్లి', 'పరిమళించిన మానవత్వం', 'బంధం' 'నామోషీ' మొ. కథలు మానవీయ దృక్పథాన్ని, సామాజిక సందేశాన్ని, స్త్రీ జీవనచిత్రణను పొదుగుకుని కనిపిస్తాయి.

బిర్లా ప్లాంటోరియంలో జరిగిన ఓ ఈవెంట్ లో భాగంగా బెస్ట్ యాంకర్‌గా ఆమెకు నంది అవార్డునిచ్చారు. ఇటీవల గిడుగు రామమూర్తి ఫౌండేషన్ వారు కళారంగంలో ఆమెకు పురస్కారాన్నిచ్చారు. పరిశోధక విద్యార్థినిగా, కథారచయిత్రిగా, యాంకర్‌గా, యాక్ట్రెస్‌గా, డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా, న్యూస్ రీడర్‌గా తన బహుముఖీనమైన ప్రతిభను చాటుకుంటూ ముందుకు సాగుతోంది పెద్దపల్లి తేజస్వి. విద్యారంగంలోనూ, కళారంగంలోనూ ఆత్మవిశ్వాసంతో, దృఢ సంకల్పంతో దూసుకెళ్తున్న పెద్దపల్లి తేజస్వికి ఇంకా తాను అనుకున్న రంగాల్లో రాణించడానికి, అహర్నిశలు కష్టపడుతోంది.. ఆమె నేటి అమ్మాయిలకు ఆదర్శం.



## పుల్వామా దాడి అమరజవానులకు నివాళ్లు

**వేద న్యూస్, మిర్యాలగూడ ప్రతినిధి :**

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు దైద శ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన భారత వీర జవాన్లకు ఘన అశ్రునివాళ్లు అర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూ శ్రీనగర్ జాతీయ రహదారిలో భారతీయ సైనికులను తీసుకు వెళుతున్న వాహనాల కాన్వాయ్ లేతిపుర (అవంతిపుర సమీపంలో) కారుతో ఆత్మహుతి బాంబు దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది రిజర్వు పోలీస్ ఫోర్స్ సిఆర్పిఎఫ్ సైనికులు వీరమరణం పొందారు. ఈ ఘటనలో ప్రాణాలర్పించిన భారత వీర జవాన్లను స్మరిస్తూ శుక్రవారం నివాళులు అర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధీరావత్ ధర్మానాయక్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారత సైన్యంలో చేరి దేశానికి ఉన్నతమైన సేవలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొర్ర కృష్ణ కాంత్ నాయక్, నరసింహ అడ్వకేట్,సంజయ్ కుమార్, పి .సురేందర్, వి.శంకర్, చిలుములవెంకట్ ,గోపి, చిలుమల కొండల్, దైదశ్రీకాంత్, రోహిత్ , విజయ్, వి .రాజు, వెంకటేష్, శరత్, వి.రాజ్ కుమార్, అవినాష్, రవి,సాయినాథ్, బి .సైదులు, ఈట గిరి, చింటూ, శ్రీకాంత్, సైదులు, దైద రవి, కిషోర్ మరియు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## పదవి ముగిసింది.. అప్పులు మిగిలాయి..!

మొదటి పేజీ తరువాయి



శరణ్యమంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ రవీందర్ రావు మాట్లాడుతూ..పెండింగ్‌లో ఉన్న బిల్లులు గ్రామపంచాయతీ భవన నిర్మాణ వ్యయం రూ.20 లక్షలు, మన ఊరు మనబడిలో జెడ్పీహెచ్ఎస్ డైనింగ్ హాల్ నిర్మాణం రూ.6 లక్షలు, జీపీ నుండి (ఫండ్) ప్రధానోపాధ్యాయులు ఆఫీస్ నిర్మాణ వ్యయం రూ.2.50 లక్షలు, మన ఊరు మనబడిలో భాగంగా ఎంపీపీఎస్ నడికూడ క్లాస్ రూముల నిర్మాణ వ్యయం రూ.14 లక్షలు, ఆర్‌డబ్ల్యూఎస్ సప్లయ్ కోసం సీడీపీ నిధుల నుంచి పైప్ లైన్ కోసం రూ.5 లక్షలు జీపీ డెవలప్‌మెంట్‌లో భాగంగా గ్రావెల్, లైటింగ్ వ్యయం రూ.8 లక్షలు.. మొత్తం రూ.55.50 లక్షలు అప్పులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేసినట్టు రవీందర్‌రావు వెల్లడించారు. ప్రజాసేవలో ఉంటూ, గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లుటకు అహర్నిశలు కష్టపడ్డానని చెప్పారు. గ్రామాభివృద్ధి చేయడమే తప్పా? అని ప్రశ్నిస్తున్నారు. కష్టాల్లో ఉన్న సర్పంచులను ఆదుకోనలేరా ప్రభుత్వమా? అని అడిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం 14 నెలల నుంచి తమ పెండింగ్ బిల్లులు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్న తరుణంలో.. తాము అప్పులు చేసి తెచ్చిన డబ్బులకు వడ్డీలు కట్టలేక తమ.. కుటుంబం రోడ్డు మీద పడ్డ సందర్భంగా తాము ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలో ఉన్నామని వెల్లడించారు. తమను ఆదుకోవాలని కోరారు.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073